
www.jananinadam.com
RNI NO:TGTEL/25/A0870
Follow:

# జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక


జననినాదం పాఠకులకు శ్రేయోభిలాషులకు
రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

శుక్రవారం 28 -08- 2026
సంపుటి : 2 సంచిక : 121
ఆసిఫాబాద్ Asifabad
హైదరాబాద్ Hyderabad
ఎడిటర్ : జాధవ్ రోహిదాష్
Editor: JADAV ROHIDAS
పేజీలు : 04
వెల: రూ.2.00
Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , www.jananinadam.com



## గవర్నర్ ను పరామర్శించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ 27:**అనారోగ్యంతో హై టెక్ సిటీ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ను సీఎం రేవంత్ రెడ్డి గురువారం పరామర్శించారు. అయన వెంట ,ఎంపీ వేం నరేందర్ రెడ్డి తదతరులున్నారు.

## ఖేలో ఇండియా సంవాద్

### దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం
### క్రీడాకారులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు



2వ పేజీలో...

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 27:** దేశ యువత, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినో త్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నిర్వ హించిన ఖేలో ఇండియా సంవాద్ కార్య క్రమంలో ఆయన పర్చువల్గా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ అలథెట్స్తో ప్రధాని మోదీ పర్చువల్గా సంభాషించారు.



2వ పేజీలో...

## మీరాలం ట్యాంక్ను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ 27:** హైదరాబాద్ మీరాలం ట్యాంక్ను ప్రముఖ పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా సాగుతున్న పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ సాగుతున్న పనులను ఒక్కొక్కటిగా పరిశీలించారు. అత్యుత్తమ డిజైన్లతో పర్యాటకులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. కొనసాగుతున్న పనులపై ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన ద్వారా అధికారులు వివరించారు. ప్రణాళికలను పూర్తిగా పరిశీలించిన తర్వాత ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ట్యాంక్ చుట్టూ జరుగుతున్న అభివృద్ధి పనులను ఓపెన్-టాప్ జీపులో ప్రయాణించి ఆ ప్రాంతాన్ని మొత్తంగా పరిశీలించారు. మీరాలం చెరువుపై నిర్మిస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జ్ పనులను భారీ క్రేన్ సహాయంతో పైకి వెళ్లి చూశారు. చెరువులోకి మురుగు నీరు చేరకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే చెరువు



2వ పేజీలో...

## హన్మకొండలో బిఆర్ఎస్ ధర్మ

### హరీష్ రావు అరే పోలీస్ స్టేషన్ ముందు బైఠాయింపు

**వరంగల్, ఆగస్ట్ 27:** బీఆర్ఎస్ ఎల్పీఉప నేత తన్నీరు హరీష్ రావును హనుమకొండ సుబేదారి లో పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉ ద్యోగులకు హరీష్ రావు మద్దతు తెలిపారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం సమీపం లోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆందోళనకు వెళుతున్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపిన తర్వాత

## యధావిధిగా లోక్సభనియోజకవర్గాలు

### మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి
### ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33 శాతం మహిళా రిజర్వేషన్లు
### ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ
### తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్



2వ పేజీలో...

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 27:**లోక్సభ నియోజకవర్గాలను యధావిధిగా కొన సాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమ లు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డీలిమిటేషన్పై వెంటనే అఖిల పక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమను కుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్లో డీలిమిటేషన్కు సంబంధించిన సవరించిన బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన

## సింగరేణి నూతన ప్రాజెక్టులు, భవిష్యత్విస్తరణప్రణాళికలపై
## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష



**హైదరాబాద్ 27:** మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్లో సింగరేణి నూతన ప్రాజెక్టులు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై సంస్థ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా కీలక, వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణ, మైనింగ్ రంగాల్లోకి సింగరేణి విస్తరించాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. కర్ణాటకలోని దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ బ్లాక్లో అన్వేషణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్, వనాడియం, టైటానియం వంటి భవిష్యత్ కీలక ఖనిజాల అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు దేశీయ, అంతర్జాతీయ ఖనిజ వేలాల్లో సింగరేణి చురుకుగా పాల్గొనాలని సూచించారు. నైనీ స్ఫూర్తితో దేవదుర్గ ప్రాజెక్టును విజయవంతం చేసి, కీలక ఖనిజాల రంగంలో సింగరేణి విస్తరణకు బలమైన పునాది వేయాలని ఆయన పేర్కొన్నారు. సింగరేణిని మరింత లాభదాయకంగా తీర్చిదిద్ది, భవిష్యత్ తరాలకు బలమైన ప్రభుత్వ రంగ సంస్థగా అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

## నేపాల్ వరదల్లో 300 మంది భారతీయుల గల్లంతు..!



### విషాదంలో 175కు పెరిగిన మృతుల సంఖ్య
### సహాయక చర్యలకు అనుమతి కోరిన జగ్గీవాసుదేవ్

**ఖాట్మండ్, ఆగస్ట్ 27:** నేపాల్ ప్రకృతి విలయంలో గల్లంతైనవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ జలప్రళయంలో 300 మంది వరకు భారతీయులు కొట్టుకుపోయినట్లు నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ గురువారం వెల్లడించారు. ఈ విషాదంలో మృతుల సంఖ్య 175కు పెరిగింది. నేపాల్ లోని విపత్తు నిర్వహణ సంస్థ ప్రకటన ప్రకారం.. ఈ ఆకస్మిక వరదల కారణంగా 826 మంది ఆచూకీ గల్లంతయ్యింది. వారిలో 85 మంది భద్రతా సిబ్బంది కాగా.. 162 మంది వివిధ హైడ్రోపవర్ కేంద్రాల్లో పనిచేస్తోన్న ఉ ద్యోగులు ఉన్నారు. 579 పర్యాటకులు ఉన్నారని ఆ సంస్థ పేర్కొంది. వేలమంది నిరాశ్రయులయ్యారు. ఈ భారీ విపత్తు తీవ్రతను అంచనా వేస్తున్నాం అని ఖనాల్ పేర్కొన్నారు.

## ఎఐసిసి పరిధిలో కొండా సురేఖ వ్యవహారం

### అధిష్టానం తీసుకునే నిర్ణయం అందరికీ శిరోధార్యం
### కాంగ్రెస్లో వ్యక్తిగత కోపాలకు తావు లేదన్న మహేశ్ గౌడ్



**నిజామాబాద్, ఆగస్ట్ 27:** మంత్రి కొండా సురేఖ అంశం కాం గ్రెస్ పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపు తున్న విషయం తెలిసిందే. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర వ్యాఖ్యలు చేయడం.. దీనిపై సురేఖకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇవ్వగాకుమార్తె కామెంట్స్ కు తనను బాధ్యురాలిని చేయొద్దంటూ మంత్రి వివరణ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా, ఈ వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కొండా సురేఖ ఎపిసోడ్ ఏఐసీసీ పరిధిలో ఉ ందన్నారు. క్రమశిక్షణ కమిటీ నివేదికను ఏఐసీసీకి పంపించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్లో స్వేచ్ఛ ఉందని, అయితే అది క్రమశిక్షణకు లోబడి ఉండాలన్నారు. ఇతర పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్లోనే స్వేచ్ఛ ఎక్కువన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరిపైనా కోపాలు, కక్షలు ఉండవని.. కొండా మురళి తనతో ఎలాంటి సంప్రదింపులు జరుపలేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా... స్వాగతిస్తామని చెప్పారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినంత ప్రాధాన్యం ఏ పార్టీ ఇవ్వలేదన్నారు. ఇకపోతే తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలో రాజీ ఉండదని తేల్చిచెప్పారు. తెలంగాణకు ఏ రకంగానూ అన్యాయం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. తనకు సర్ నోటీసు అందిందని.. వివరాలు సమర్పిస్తానని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



2వ పేజీలో...

## తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణం

### సెప్టెంబర్ 1న ఢిల్లీలో కీలక సమావేశం

**హైదరాబాద్ 27:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిరంతర ప్రయత్నాల నేపథ్యంలో ప్రాణహిత నదిపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలపై సెప్టెంబర్ 1న ఢిల్లీలో కీలక సమావేశం జరగనుంది. కేంద్ర జల సంఘం (అచిఅ) చైర్మన్ అధ్యక్షతన సేవా భవన్లో జరిగే ఈ సమావేశంలో తెలంగాణ, మహారాష్ట్ర జలవనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి గారు మే 26న మహారాష్ట్ర ముఖ్యమంత్రి కి లేఖ రాసి, రెండు రాష్ట్రాల మధ్య సమావేశం ఏర్పాటు చేసి పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం సూచించాలని కోరారు. ఈ అంశాన్ని ప్రధానమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లగా, ప్రధానమంత్రి కార్యాలయం జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపించింది. అనంతరం ముఖ్యమంత్రి ఆగస్టు 5న కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ కి ప్రత్యేకంగా లేఖ రాసి కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు.

# మీరాలం ట్యాంక్ను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి


మొదటిపేజీ తరువాయి...

నుంచి మూసీలోకి వరద నీరు వెళ్లేలా నాలాను విస్తరించాలని చెప్పారు. పర్యాటకులు చెరువులో వాటర్ స్పోర్ట్స్ కోసం డిజైన్ చేయాలని, చెరువు మధ్యలో ఉన్న ఐలాండ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని చెప్పారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉన్నందున మీరాలం చెరువును, పరిసర ప్రాంతాలను పర్యాటకులకు ఆకట్టుకునేలా ఏర్పాట్లు జరగాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆకస్మిక పర్యటన సందర్భంగా మూసీ ర్ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ఉన్నతాధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



# ఖేలో ఇండియా సంవాద్

మొదటిపేజీ తరువాయి...



అనం తరం యువతను ఉద్దేశించి ప్రసం గించారు. క్రీడలంటే కేవలం మెడల్స్ కాదని.. యువతలో ఉన్న చైతన్యాన్ని మేల్కొలిపే సాధనాలనీ మోదీ చెప్పు కొచ్చారు. ఆటలు యువశక్తిని వెలికితీ స్తాయన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి యువశక్తితో పాటు క్రీడాశక్తి కూడా ఎంతో అవస రమని మోదీ పేర్కొన్నారు. భారత్ ఒలింపిక్స్లో తగిన ప్రాతినిథ్యం వహించట్లేదని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. దేశం క్రీడలపై ఎక్కువగా ఆసక్తి చూపడంలేదన్నారు. 2012లో ఒలింపిక్స్లో పాల్గొన్న భారత్.. 12 ఆటల్లో మాత్రమే మెడల్స్ సాధించిందని తెలిపారు. సర్ఫింగ్ వంటి ఆటల్లో మన క్రీడాకారులు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిభకు లోటు లేదని, మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల వారిలో టాలెంట్ను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఒలింపిక్స్లో భారత్ చెప్పుకోదగ్గ స్థాయిలో పథకాలను సాధించాలని ఆయన కోరారు. ఇందుకోసం ప్రభుత్వం.. క్రీడాకారులు, అలథెట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామి ఇచ్చారు. డిసెంబర్లో లో జరిగే 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్నగర్ జిల్లాలో ఈ పోటీలను నిర్వహించనున్నారు.

# హన్మకొండలో బిఆర్ఎస్ ధర్న

మొదటిపేజీ తరువాయి

హరీష్ రావును అరెస్ట్ చేసే ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్త త వాతావరణం నెలకొంది. హరీష్ రావును సమీపంలోని సుబేదారి పోలీసు స్టేషన్ కు కాలినడకన తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సుబేదారి పీఎస్ కు తరలివచ్చి స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. అలాగే జిల్లాలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు. ముందస్తు అరెస్ట్ చేశారు. జిల్లాలో జీవో 97 రద్దు చేయాలని నిరసనలు తెలుపుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు మాజీ మంత్రి హరీశ్ రావు వస్తున్న నేపథ్యంలో వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. కళాశాలకు వచ్చే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపించారు. అలాగే వరంగల్,



హనుమకొండలో విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఇప్పటికే ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ను హౌస్ అరెస్ట్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డిని అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు.

# నేపాల్ వరదల్లో 300మంది భారతీయుల గల్లంతు..!

మొదటిపేజీ తరువాయి...



అటు టిబెట్ వైపు 588 మంది గల్లంతయ్యారు. వారిలో 260 మంది విదేశీయులే. హిమాలయాల్లో కరిగిన మంచు జలవనరుల్లో నీటి మట్టాలను పెంచుతుందని, ఇప్పుడు మనందరం చూసింది అదేనని నేపాల్ మంత్రి అన్నారు. ఈ వరద మరింత దిగువకు ప్రవహించి ఉంటే.. భారత రాష్ట్రాలపైనా ప్రభావం పడేదని తెలిపారు. గతంలోనూ ఇలా జరిగిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. భారత్, చైనా, నేపాల్, భూటాన్ పర్యావరణపరంగా అనుసంధానమై ఉన్నాయని, ఈ దేశాలు తమ విభేదాలను పక్కన పెట్టి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు సంభవించిన వరద గురించి చైనాకు ముందే తెలిసినా నేపాల్ను అప్రమత్తం చేయలేదని తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి స్పందన వచ్చింది. ఈ వరదల్లో ఈశా ఫౌండేషన్కు చెందిన దాదాపు 80 మంది గల్లంతైన సంగతి తెలిసిందే. దీనిపై సద్గురు జగ్గీ వాసుదేవ్ స్పందించారు. సహాయక చర్యల్లో సహకరించేందుకు తనతోపాటు మరికొంతమంది వాలంటీర్లను అనుమతించాలని చైనా అధికారులను కోరారు. ప్రకృతి విపత్తుతో అల్లకల్లోలమైన హిమాలయ దేశానికి భారత్ ఆపన్న హస్తం అందించింది. రెండు విమానాల్లో 47.5 టన్నుల సహాయక సామగ్రితో పాటు రెస్క్యూ బృందాలను ఖాట్మాండూకు పంపింది.

# యధావిధిగా లోక్సభనియోజకవర్గాలు

మొదటిపేజీ తరువాయి...



రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్ సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూటమి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్ని స్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమిటేషన్ పక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు.. ...

# తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణం

మొదటిపేజీ తరువాయి...

మహారాష్ట్ర గతంలో అంగీకరించిన 148 మీటర్ల ఎత్తుకు బదులుగా 152 మీటర్ల ఎత్తు ఉండేలా అంగీకారం సాధించేందుకు తెలంగాణ ప్రయత్నిస్తోంది. 148 మీటర్ల వద్ద అవసరమైన నీటిని గ్రావిటీ ద్వారా తీసుకోవడం సాధ్యం కాదని, భారీ పంపులు వినియోగిస్తే విద్యుత్ వ్యయం పెరుగుతుందని తెలంగాణ ఇప్పటికే కేంద్రానికి నివేదించింది. తక్కువ విద్యుత్ వ్యయంతో, దీర్ఘకాలికంగా రాష్ట్రానికి ప్రయోజనం కలిగేలా ప్రాజెక్టును నిర్మించాలన్నది తెలంగాణ ప్రభుత్వ ప్రధాన వాదన. సీడబ్ల్యూపీఆర్ఎస్ అధ్యయనాల ప్రకారం జలమట్టం పెంచడం వల్ల అదనపు ముంపు పరిమితంగానే ఉంటుందని కూడా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి వివరించింది. వెనుకబడిన, కరవు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించే ఈ కీలక ప్రాజెక్టును త్వరగా కార్యరూపంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కేంద్రం, మహారాష్ట్రతో వరుసగా సంప్రదింపులు కొనసాగిస్తోంది.



# సత్యనారాయణ గౌడ్ ని పరామర్శించిన మంత్రి శ్రీదర్ బాబు

**-మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచన.**

కమాన్ పూర్, ఆగస్టు 27: పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సుందిల్ల శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్,సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కోరుకొప్పుల సత్యనారాయణ గౌడ్ గుండెపోటుతో కరీంనగర్లోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.విషయం తెలుసుకున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు గురువారం ఆసుపత్రికి వెళ్లి సత్యనారాయణ గౌడ్ను పరామర్శించారు.అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సత్యనారాయణ గౌడ్కు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.మంత్రి వెంట గ్రామ సర్పంచ్ ముస్కుల నరేందర్ రెడ్డి,స్థానిక కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.



# అర్హులందరు ఓటు హక్కు కలిగి ఉండాలి..



**జయశంకర్ భూపాలపల్లి.ఆగస్టు 27:** అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు ఉండేలా, అనర్హమైన మరియు వాస్తవంగా లేని ఓట్లను తొలగించి పారదర్శకమైన తుది ఓటర్ల జాబితా రూపొందించడమే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం నిర్వహించిన సర్ ప్రత్యేక గ్రామసభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, సర్ ప్రక్రియ, డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో గుర్తించిన అనామలీస్, నో మ్యాపింగ్ కేసులు, నోటీసుల జారీ, విచారణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచనల మేరకు ప్రతి గ్రామంలో, పట్టణ ప్రాంతాల్లోని ప్రతి వార్డులో ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో గత రెండు నెలలుగా సర్ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. సర్ లో భాగంగా బూతు స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను అందించారని, 2002 నాటి సర్ ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టి ఫారాలను పూర్తి చేసినట్లు తెలిపారు. అనంతరం డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రచురించినట్లు వివరించారు.డ్రాఫ్ట్ జాబితాలో ప్రధానంగా నో మ్యాపింగ్, అనామలీస్ అనే రెండు రకాల సమస్యలను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. 2002 సర్ జాబితాతో మ్యాపింగ్ కాని ఓటర్లను నో మ్యాపింగ్ కేటగిరీగా, ఓటరు పేరు, ఇంటిపేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు తదితర వివరాల్లో వ్యత్యాసాలను అనామలీస్గా గుర్తించినట్లు చెప్పారు.ఈ కేటగిరీల్లో ఉన్న ఓటర్లకు సంబంధిత బిఎల్ ఓ ల ద్వారా నోటీసులు జారీ చేస్తామని, నోటీసు అందుకున్న వారు రసీదుపై సంతకం చేసి బి ఎల్ ఓకు అందజేయాలని సూచించారు. నోటీసులో పేర్కొన్న తేదీ, సమయం, ప్రదేశంలో జరిగే విచారణకు హాజరై, అవసరమైన ఆధారాలను సమర్పించాలని కోరారు.విచారణ గ్రామపంచాయతీ, ఎంపీడీఓ లేదా తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే అవకాశం ఉంటుందని, సంబంధిత వివరాలు నోటీసులో స్పష్టంగా పేర్కొంటామని తెలిపారు. ఓటర్ల వయస్సు, పుట్టిన తేదీ తదితర వివరాలను నిర్ధారించేందుకు అవసరమైన గుర్తింపు పత్రాలు, తల్లిదండ్రులకు సంబంధించిన ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. జెన్యూన్ ఓటర్లకు పూర్తి రక్షణసర్ ప్రక్రియలో అసలైన ఓటర్ల పేర్లు తుది జాబితాలో ఉండేలా చూడటమే ప్రధాన బాధ్యతని ఆయన తెలిపారు. అర్హత లేని లేదా వాస్తవంగా లేని ఓట్లను నిబంధనల ప్రకారం తొలగిస్తూ, అక్టోబర్లో ప్రచురించే తుది ఓటర్ల జాబితాలో ప్రతి ఓటరుకు తప్పనిసరిగా ఓటు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, నిర్ణీత తేదీన విచారణకు హాజరై తమ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించాలని సూచించారు. సందేహాలు ఉంటే సంబంధిత బూతు స్థాయి అధికారులను సంప్రదించాలని సూచించారు.భూపాలపల్లి ఆర్డీఓ ఈ ఆర్ఓగా, గణపురం తహసీల్దార్, ఎంపిడివోలు ఏఈఆర్ఓగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.ప్రజాస్వామ్య ప్రక్రియలో రాజకీయ పార్టీలకు కూడా కీలక పాత్ర ఉందని రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), బిఎల్ఓ లతో సమన్వయం చేసుకుని సర్ ప్రక్రియలో ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.గణపురం మండలంలో సర్ పురోగతిగణపురం మండలంలో డ్రాఫ్ట్ ప్రక్రియకు ముందు 33,493 మంది ఓటర్లు ఉండగా, సర్ ప్రక్రియలో 3,371 ఓట్లు తొలగించడంతో ప్రస్తుతం 30,122 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.మండలంలో ప్రస్తుతం 36 పోలింగ్ స్టేషన్లు ఉండగా, కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలను దృష్టిలో ఉంచుకుని అదనంగా 3 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురణకు ముందు గణపురం మండలంలో 6,338 అనామలీస్ గుర్తించగా, వాటిలో 4,395 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ప్రస్తుతం 1,945 అనామలీస్, 1,551 నో మ్యాపింగ్ కేసులు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలో సుమారు 35 వేల అనామలీస్, నో మ్యాపింగ్ కేసులు ఉన్నాయని,నోటీసుల జారీ, విచారణ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన ప్రతి ఓటరుకు తుది జాబితాలో చోటు కల్పించేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. సర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, బిఎల్ఓ లు, బిఎల్ ఏలు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, తహసీల్దార్ రాజేశ్వర రావు, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.



# భూసమస్యలపై రెవెన్యూ సదస్సు దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి.

**జయశంకర్ భూపాలపల్లి. ఆగస్టు 27:** జిల్లాలో భూ దార్ కార్డుల జారీ కోసం చేపట్టిన రీ-సర్వే పనులను వేగవంతం చేయడంతో పాటు, 22ఏ నిషిద్ధ భూముల పై అర్జీలు, భూభారతి, సాదా బైనామా, రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్లో ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 31న రెవెన్యూ శాఖ మంత్రి ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై సమీక్ష సమావేశం జరగనున్నందున అధికారులు పూర్తి సమాచారంతో సన్నద్ధంగా ఉండాలని సూచించారు.జిల్లాలో గుర్తించిన 70 గ్రామాల్లో రీ-సర్వే ప్రక్రియను నిబంధనల మేరకు పక్కాగా చేపట్టాలని, క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన కొలతలు నిర్వహించి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రీ-సర్వేకు సంబంధించిన ప్రభుత్వ జీవోలను అధికారులు పూర్తిగా అధ్యయనం చేసి అమలు చేయాలని తెలిపారు.అలాగే, 22ఏ నిషిద్ధ భూముల జాబితాలో నమోదైన ప్రభుత్వ, అటవీ, నీటిపారుదల, సింగరేణి తదితర భూములను నిబంధనల ప్రకారం పరిశీలించి అవసరమైన సవరణలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేయరాదని, తిరస్కరించే దరఖాస్తులకు స్పష్టమైన కారణాలను నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ రికార్డుల సవరణ ప్రక్రియను పారదర్శకంగా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, భూపాలపల్లి, కాటారం ఆర్డీఓలు హరికృష్ణ, రవీందర్, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, సబ్ రిజిస్ట్రార్ బాలకిషన్, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



జననినాదం
శుక్రవారం28 ఆగష్టు 2026

# వన మహోత్సవ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి ఆగష్టు 27:** వన మహోత్సవంలో భాగంగా జిల్లాకు నిర్దేశించిన మొక్కల నాటే లక్ష్యాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కె.హరిత ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు కేటాయించిన వన మహోత్సవ లక్ష్యాలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు శాఖల వారీగా సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రభుత్వ భూములు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు, విద్యాసంస్థలు, కాలువలు, చెరువుల గట్లు, రహదారుల ఇరువైపులా అనువైన మొక్కలను పెద్దఎత్తున నాటాలని అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటడంతోనే కార్యక్రమం పూర్తయినట్లు కాకుండా వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి మొక్కను సంరక్షించి భవిష్యత్‌లో పచ్చదనాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యం కీలకంవన మహోత్సవంలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములై మొక్కలు నాటాలని కలెక్టర్ కోరారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పచ్చదనం పెంపొందించడం ద్వారా భావితరాలకు మెరుగైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, సంబంధిత శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిబ్బంది సంక్షేమం కోసం కృషి చేయాలి

**ఎస్పీ నితికా పంత్**

**పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక**



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి ఆగష్టు 27:** జిల్లా పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఎస్పీ అభినందించారు. ఈ సందర్బంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని నూతన కార్యవర్గానికి సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నూతన కార్యవర్గం సమర్థవంతంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అవసరమైన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. పోలీసు శాఖలో ఐక్యత, పరస్పర సహకారం, సమన్వయాన్ని మరింత బలోపేతం చేసేలా నూతన కార్యవర్గం పనిచేయాలని ఎస్పీ సూచించారు. శాఖలో సానుకూల వాతావరణాన్ని పెంపొందించేందుకు అధికారులు, సిబ్బంది అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం చేపట్టే కార్యక్రమాలకు జిల్లా పోలీసు శాఖ తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. నూతన కార్యవర్గం తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ సిబ్బంది సంక్షేమానికి కృషి చేయాలని ఆమె ఆకాంక్షించారు.

**నూతన కార్యవర్గం....**

అసోసియేషన్ అధ్యక్షుడిగా బి. శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఈ. రమేష్, కె. సందీప్ కుమార్ , కార్యదర్శిగా ఎన్. వామనమూర్తి , సంయుక్త కార్యదర్శిగా బి. విజయ్ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా టి. లావణ్య, కోశాధికారిగా ప్రేమ్ సింగ్ ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా పి. రాజేందర్ , ఈ. స్వప్న , ఆర్. సుజాత, కె. అనూష కె. వినయ్ , వై. ప్రశాంత్ ఎన్నికయ్యారు.

# వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలతో నివేదికలు సమర్పించాలి

**నిషేధిత జాబితాలో భూముల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలి**




**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి ఆగష్టు 27:** జిల్లాలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలను సమగ్రంగా సేకరించి నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దానరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, చెన్నూరి కిష్టయ్య, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ వినయ్‌తో కలిసి తహసీల్దార్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలను కచ్చితంగా నమోదు చేసి, సమగ్ర నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు. లావుని పట్టా, సీలింగ్, ప్రభుత్వ, అటవీ, దేవాదాయ, వక్ఫ్ భూములతో పాటు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఆస్తులు, విచారణ సంస్థలు అటాచ్ చేసిన ఆస్తులను నిషేధిత జాబితాలోని సంబంధిత కేటగిరీల్లో చేర్చాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులు, కాలువల అభివృద్ధి తదితర పనుల కోసం సేకరించిన భూముల వివరాలను కూడా సంబంధిత జాబితాలో నమోదు చేయాలని తెలిపారు. భూముల వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సాదాబైనామా, రెవెన్యూ సదస్సులు, భూభారతి ద్వారా వచ్చిన భూ సమస్యల దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలపై అందిన దరఖాస్తులపై కూడా వెంటనే స్పందించి, నిబంధనల ప్రకారం పరిష్కారం చూపాలని ఆదేశించారు. సమీక్షలో తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి




**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి ఆగష్టు 27:** కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో అదనపు గదుల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. విద్యాలయంలోని వంటశాల, భోజనశాలలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, వంటశాలలో పాటిస్తున్న పారిశుద్ధ్య ప్రమాణాలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి విద్యాలయంలో అందుతున్న విద్యా బోధన, వసతులు, మధ్యాహ్న భోజన నాణ్యత, త్రాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పల్లె దవాఖానను పరిశీలించిన డీఎంహెచ్‌వో



**జననినాదం, తిర్యాణి 27:** మండలంలోని పంగిడి మాధర పల్లె దవాఖానను గురువారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) పరిశీలించారు. ఈ నెలాఖరు వరకు సెంట్రల్ బృందం పర్యటించనున్న నేపథ్యంలో ఆరోగ్య ఆయుష్ మందిరంలోని వసతులు, వైద్య సేవలను పరిశీలించారు. బృందం పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, మౌలిక వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సెంట్రల్ బృందం పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ముందుగా డిఎంహెచ్ఓ ని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అక్షితక్ కుమార్, వైద్య బృందం సభ్యులు, మందగూడ సర్పంచ్ తుంరం గోపాల్,పంగిడి మాధర సర్పంచ్ రాధ పాల్గొన్నారు.

# రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి





**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి ఆగష్టు 27:** జిల్లాలో భూ రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, సర్వే ల్యాండ్ రికార్డ్ ఎ.డి. శ్రీనివాస్ లతో కలిసి లైసెన్స్డ్ సర్వేయర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీ-సర్వేలో భాగంగా లైసెన్స్డ్ సర్వేయర్లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, జిల్లాలోని ప్రభుత్వ భూములు, అటవీ భూములు, గ్రామాల హద్దులు తదితర ప్రాంతాలను సమగ్రంగా సర్వే చేయాలని తెలిపారు. ప్రతి బృందం లక్ష్యానికి అనుగుణంగా సర్వే పనులను పూర్తి చేయాలని, ఒక బృందం రోజుకు 30 ఎకరాల వరకు సర్వే చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. సర్వే, కొ-రిలేషన్ స్టేట్‌మెంట్ తయారీతో పాటు నోటీసుల జారీ ప్రక్రియను ఏకకాలంలో చేపట్టాలని, రైతులకు నోటీసులు సకాలంలో అందజేయాలని, రీ-సర్వే ప్రక్రియపై రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. నోటీసుల జారీలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల హద్దుల నిర్ధారణకు సంబంధించిన సమాచారం సర్పంచులు, రైతులకు అందించాలని, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రీ-సర్వే ప్రక్రియలో ప్రజల సహకారం తీసుకుని పారదర్శకంగా పనులను పూర్తి చేయాలని తెలిపారు. రీ-సర్వేకు సంబంధించి ఫారాలు అందుబాటులో ఉన్నాయని, నిబంధనల ప్రకారం సక్రమంగా పూర్తి చేసి రికార్డులను సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో రీ-సర్వేకు పైలట్ గ్రామంగా తాండూర్ మండలంలోని రాంపూర్ గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగిందని, గ్రామంలో సుమారు 581 ఎకరాల భూమి ఉందని తెలిపారు. ప్రతి మండలం నుంచి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, ఆ గ్రామంలో రీ-సర్వే ప్రక్రియపై అవసరమైన శిక్షణ అందించాలని సూచించారు. రీ-సర్వే పనులపై తహసిల్దార్లు ప్రత్యేక చొరవ చూపి క్షేత్రస్థాయిలో పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. జి.పి.ఓ.లు భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను సక్రమంగా సిద్ధం చేసి, రీ-సర్వేకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్ సమయంలో తహసిల్దార్ కార్యాలయాలలో సీలింగ్ డిక్లరేషన్‌ను పరిశీలించి, నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. భూభారతి దరఖాస్తులలో భూమి విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డులతో సరిపోల్చిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎస్.ఐ.ఆర్. నోటీసుల జారీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, జిల్లాలో ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. రీ-సర్వే, ఎస్.ఐ.ఆర్., రెవెన్యూ రికార్డుల నవీకరణ ప్రక్రియలు సమన్వయంతో కొనసాగిస్తూ నిర్ణీత లక్ష్యాలను చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములు, అటవీ భూములు సహా జిల్లాలోని అన్ని భూముల వివరాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా సర్వే చేసి, రికార్డులను నవీకరించాలని సూచించారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని, ప్రతి రోజు సాధించిన పురోగతిని సమీక్షిస్తూ రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాలలో డీడీ ఆకస్మిక తనిఖీ



**జననినాదం, కెరమెరి 27:** మండలంలోని రాంజీగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాలను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ ఏఈ నజీమోద్దీన్‌తో కలిసి పాఠశాలలోని మౌలిక వసతులను పరిశీలించారు. పాఠశాల భవనం, ప్రహరీ, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, విద్యాబోధన, వసతి, భోజనం, ఆరోగ్య పరిస్థితులపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతోనూ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను అధికారులు డీడీ దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు మెరుగుపరచాలని సూచించారు. విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన వసతులు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

# ముందస్తు రక్షాబంధన్ వేడుక




**కమాన్ పూర్ పాలకుర్తి ఆగస్టు 27:** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఘన్యందాస్ నగర్ గ్రామపంచాయితీ పరిధిలోని ప్రముఖ పాఠశాల అయిన "యూనివర్సల్ ఐ.ఐ.టి- నీట్ ఫౌండేషన్ హైస్కూల్" లో గురువారం రోజు "రక్షాబంధన్ "వేడుక ఘనంగా నిర్వహించడమైనది. కార్యక్రమంలో భాగంగా ప్రార్థనా సమావేశంలో విద్యార్థుల ఉపన్యాసాలతో మొదలైంది. బాలికలు వారి అన్నయ్య, తమ్ముళ్ళకు బొట్టుపెట్టి, రాఖి కట్టి, హారతి పట్ట, స్వీట్స్ తినిపించగా, బాలురు అక్క, చెల్లెల్ల చల్లని ఆశీర్వాదాలు పొంది వారికి బహుమతులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ ఇస్మాయిల్, మరియు ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అఫ్జల్ మాట్లాడుతూ తోబుట్టువుల యొక్క బంధం ఎవలేనిది అనీ ఒకరికి ఒకరు రక్ష అనీ అలాగే అందరూ దేశానికి రక్షగా ఉండాలని వారి అమూల్యమైన సందేశాన్ని, విద్యార్థులకు అందించారు.

జననినాదం



# సమస్యల పరిష్కారానికి టిజిఈజేఏసి “మహాధర్నా”

### -సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం తీవ్రతరం

**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి ఆగష్టు 27:** ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను రాష్ట్రప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి, సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి, ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని టిజిఈజేఏసి నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (టిజిఈజేఏసి) పిలుపుమేరకు గురువారం టీజీఈజేఏసి జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి, సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి ల ఆధ్వర్యంలో జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత కార్యాలయాల భవన సముదాయం ఎదుట మహా ధర్నాను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా గల అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల అసోసియేషన్లు, ఆఫీస్ సబార్డినేట్ నుంచి జిల్లా స్థాయి అధికారులు సుమారు 4500 మంది హాజరై, మహా ధర్నా కార్యక్రమంలో పాల్గొని, నిరసన వ్యక్తం చేశారు. ముందుగా ఐడిఓసి ముఖద్వారం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టి, అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార దీపక్ అందజేశార ఈ సందర్భంగా టీజీఈజేఏసి జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సంఘాలన్నీ ఐక్యంగా కృషి చేయాలన్నారు. ఉద్యోగులకు 2వ పిఆర్సి ని తక్షణమే అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న 6 విడతల డిఏ లను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన ఈహెచ్ఎస్ ను తక్షణమే సమర్థవంతంగా అమలు చేయాలని, పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ కోసం ప్రతి నెల 2,000 కోట్ల రూపాయలు విడుదల చేసి ఉద్యోగులకు బకాయిలను త్వరితగతిన చెల్లించాలని, ఉద్యోగుల





సిపిఎస్ సమస్యను పరిష్కరించి ఉద్యోగం న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రంలోని ఉద్యోగ సంఘాలకు, అసోసియేషన్లకు తగిన గుర్తింపు కల్పించాలి, సమస్యలను అధికారికంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిగణించి, చర్చల ద్వారా తక్షణ పరిష్కారం చూపాలని కోరారు. న్యాయమైన డిమాండ్ ఉద్యోగుల ఆర్థిక సామాజిక సేవ ప్రజలకు సంబంధించిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వము తక్షణమే స్పందించి వెంటనే చర్చలు పిలిచి సమస్యలు తక్షణం పరిష్కారం చూపాలన్నారు జిల్లా సెక్రెటరీ జనరల్ వనజా రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అవసరమైన తదుపరి కార్యాచరణను సంఘాల నాయకులతో సమన్వయం చేసుకొని చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టిజిఈజేఏసీ అదనపు సెక్రటరీ జనరల్ కే శంకర్, జిల్లా కో చైర్మన్లు జి చక్రపాణి, శ్రీనివాస్ రావు దేశ్ పాండే, పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు, బట్టారి వెంకటేశ్వర్లు, గుండేటి నాందేవ్,సుమిత్,పోడేటి సంజీవ్,పొలాస సత్యనారాయణ, ధరణికోట వేణుగోపాల్,పత్తి సత్తయ్య, బి ప్రభాకర్, దుర్గ ప్రసాద్, బి రామ్మోహన్, కెవిఎల్ఎన్ మూర్తి,రాజేశ్వర్, ఎండి అజర్, రాసపల్లి రవి, జి రాజగోపాల్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ లు బొడ్డు శ్రావణ్ కుమార్, ఏ సుధాకర్, వైస్ చైర్మన్లు బి మోహన్, జి రాజవేణు, ఓ కృష్ణ, బి మనోజ్, వోతె జయకృష్ణ, సూరినేని గంగాధర్, బన్న రవీందర్, ఎస్ కిషన్, బాలకృష్ణ, ఏ సునీత, ఎన్ గోపాల్, బెజ్జంకి జగన్, ఏ రాజేందర్ రెడ్డి, మోషిన్ అహ్మద్ ,వెంకటరమణ, ఎం రమేష్ ,రాథోడ్ రమేష్, ఫైనాన్స్ కార్యదర్శి అనుముల సతీష్ కుమార్, పబ్లిసిటీ కార్యదర్శి జె రామ్ కుమార్, కార్యదర్శులు నడిమెట్ల సత్యనారాయణ, తిరుపతి,మేడి శంకర్, గుండు వెంకటేశం,జి వెంకటస్వామి, కే శ్రీధర్ స్వామి, టీజీవో,టీఎన్జీఓ, నాయకులు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# సేంద్రియ సాగుతోనే రైతులకు మేలు

### ఏకలవ్య ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ సతీష్ 50 మంది రైతులకు ఉచితంగా బయో ఇన్‌పుట్స్ పంపిణీ



**జననినాదం,సిర్పూర్(యు),ఆగష్టు 27:** సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తే భూమి సారం దెబ్బతినకుండా నాణ్యమైన పంటలు పండించొచ్చని ఏకలవ్య ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ సతీష్ అన్నారు. బొగడగూడలో గురువారం ఓ ఎఫ్ ఐ ఆర్థిక సహకారంతో ఐదు గ్రామాలకు చెందిన 50 మంది రైతులకు పెస్ట్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుల్లారా, దేవుడుపల్లి, సీతగొంది, కాపురం తదితర గ్రామాల్లో బండలు తొలగించిన భూముల్లో రైతులు సేంద్రియ సాగు చేస్తున్నారని తెలిపారు. పంటలను ఆశించే పురుగులు, తెగుళ్లను రసాయన మందులతో కాకుండా సేంద్రియ పద్ధతుల్లోనే అరికట్టాలని సూచించారు. పంటలకు వచ్చే తెగుళ్లను ముందుగానే గుర్తించి తగిన విధానాల్లో నియంత్రిస్తే సాగు ఖర్చులు తగ్గడంతో పాటు దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు. సేంద్రియ వ్యవసాయంలో ఉపయోగించే బయో ఇన్‌పుట్స్‌ను సరైన మోతాదులో, సరైన సమయంలో వినియోగించడంపై రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. శిక్షణ అనంతరం 50 మంది రైతులకు అవసరమైన బయో ఇన్‌పుట్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాథోడ్ గణేష్, శిక్షకురాలు మంగా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ రేషన్ కార్డులు

### సర్పంచ్ రాథోడ్ సునీతానేహ్రు

**జననినాదం,సిర్పూర్(యు),లింగాపూర్ఆగష్టు 27:** అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని సర్పంచ్ రాథోడ్ సునీతానేహ్రు అన్నారు. గురువారం మోతిపటార్ గ్రామపంచాయతీలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రజలకు రేషన్ సరుకులు పొందడంతో పాటు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందుతాయని తెలిపారు. అర్హులైన వారు కార్డులను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జాదవ్ మున్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి రమేష్, వార్డు సభ్యుడు రాథోడ్ శాంక,



గ్రామ నాయక్, కారోబారి, రాథోడ్ బాలు, దరిసింగ్, రాథోడ్ అంబాజీ, జాదవ్ హున్నజీ, గణేష్, పార్టీ నాయుకులు రాటోడ్ సుభాష్,గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# ఎస్సీ కాలనీకి 3-ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్

**జననినాదం,తిర్యాణి 27:** మండలంలోని కన్నెపల్లి గ్రామపంచాయతీ పరిధి ఎస్సీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 3-ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, కన్నెపల్లి సర్పంచ్ తుంరం మాన్కు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి విద్యుత్ సరఫరా ఎంతో కీలకమన్నారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను గుర్తించి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని, దీంతో తక్కువ వోల్టేజీ, తరచూ విద్యుత్ అంతరాయాల సమస్యలు తగ్గనున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు, రైతులు, చిన్న వ్యాపారులకు సైతం మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్,



శ్యామ్, మహేష్, విద్యుత్ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి ఆగష్టు 27:** జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టి త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం కర్ణమామిడి, లక్షెట్టిపేట మండలం చందారం గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఎస్ఐఆర్‌పై నిర్వహించిన గ్రామసభలలో ఆయా మండలాల తహసిల్దార్లు, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచి, అందులో గుర్తించిన అనామలీస్ ఓటర్ల వివరాలను గ్రామసభలో చదివి వినిపించాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. ఎ.ఎస్.డి. (Absent, Shifted, Dead) ఓటర్లకు సంబంధించి నోటీసులను నిబంధనల ప్రకారం జారీ చేసి,



తదుపరి ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి దశను పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని బూత్ స్థాయి అధికారులు, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాఖీలు కట్టుకుని.. సోదరభావం చాటిన విద్యార్థులు

**జననినాదం,సిర్పూర్(యు) 27:** మండలంలోని పాములవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాఖీ పండుగ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ప్రేమ, సోదరభావం, ఐక్యతను పెంపొందించేలా సాగింది.



# మాదకద్రవ్యాల నియంత్రణ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి

**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి ఆగష్టు 27:** జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణ దిశగా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో డిసిపి ఎ. భాస్కర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్య రహిత మంచిర్యాల జిల్లా సాధనలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 49 కేసులు నమోదు చేయడం జరిగిందని, ఇందులో 103 మందిని గుర్తించడం జరిగిందని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగదారులను గుర్తించి కోర్టు ద్వారా 30 మందిని డ్రగ్ డి-అడిక్షన్ కేంద్రాలకు తరలించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. విద్యా సంస్థలలో విద్యార్థులచే యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, వారి ద్వారా ప్రతి నెల అవగాహన కార్యక్రమాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై క్విజ్, డ్రాయింగ్ మొదలగు పోటీలను నిర్వహించాలని తెలిపారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహించడం, పొగాకు సంబంధిత ఉత్పత్తులను అమ్మడం నిషేధించడం జరిగిందని, ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మెడికల్, ఐటిఐ, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలలో నిత్యం మాదక ద్రవ్యాల వినియోగంపై విద్యార్థులను గమనిస్తూ మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలోని మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికి మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, బెల్ట్ షాపులను నియంత్రించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గంజాయి తదితర మొక్కల సాగు చేసే వారిని గుర్తించాలని తెలిపారు. డ్రగ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో మెడికల్ షాప్ లను నిత్యం పర్యవేక్షించాలని, సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను విక్రయించే షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఆర్.టి.సి., విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా



జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని, వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు, ఇతర రోడ్డు భద్రత సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలు, పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 95 లైసెన్సులు రద్దు చేయడం జరిగిందని, ఫిట్ నెస్ లేని స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ట్రాఫిక్ పోలీసు అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాలలో, అంతర్గత రహదారులలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓవర్ లోడింగ్, మితిమీరిన వేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై సంచరించే పశువులను అందుబాటులో ఉన్న గోశాలకు తరలించాలని, నూతన గోశాల ఏర్పాటుకు భూమిని కేటాయించడం జరిగిందని త్వరితగతిన పనులు చేపట్టి పూర్తి చేయాలని తెలిపారు. రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ల ఏసిపిలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో పేరు ఉండేలా చూడాలి

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆత్రం శంకరరావు



**జననినాదం,సిర్పూర్(యు) 27:** అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆత్రం శంకరరావు అన్నారు. గురువారం సీతగొంది, పుల్లార, రాఘపూర్ గ్రామపంచాయతీల్లో నిర్వహించిన ఎస్ఐఆర్ గ్రామసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎన్నికల ప్రక్రియలో కీలకమైనదని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన అర్హులందరూ ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. జాబితాలో పేరు లేని వారు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఓటరు జాబితాను ప్రతి ఒక్కరూ పరిశీలించుకుని అవసరమైన సవరణలు చేసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీతగొంది సర్పంచ్ బాపూజీ, కార్యదర్శి, పుల్లార సర్పంచ్ వెడ్మ జంగంబాయి, కార్యదర్శి, రాఘపూర్ సర్పంచ్ లక్ష్మీ భీర్శ, ఎంపీడీవో, ఈజీఎస్ ఏపీవో, టెక్నికల్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS**, and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460